TGTEL/26/A0372

# మన మహతి న్యూస్

## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | గురువారం మే 28, 2026 | సంపుటి : 01 సంచిక : 120 | పేజీలు 5 వెల-2/- MANAMAHATINEWS.COM

# ప్రధాని మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

**రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సీఎం వినతి**

**పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. పేజి 2లో ▶

## ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం




## నాయకులు, కార్యకర్తలు ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు: పల్లా శ్రీనివాసరావు




## 'మృతదేహాన్ని ఎవరెస్ట్‌పైనే వదిలేస్తాం'.. హైదరాబాదీ పర్వతారోహకుడి కుటుంబం




# మహిళలకు టిడిపి పెద్దపీట

- పార్టీ పరంగా 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం
- తీర్మానం ప్రతిపాదించిన వర్కింగ్ ప్రసిడెంట్ లోకేశ్




## అమెండెడ్ భారత్‌నెట్‌పై కేంద్రంతో సీఎం రేవంత్ చర్చ

**అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాంపై కేంద్రమంత్రితో చర్చించిన సీఎం రేవంత్**




హైదరాబాద్: అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. 2లో

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి




### ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు..

**డ్రైవింగ్ లైసెన్స్‌లు స్వాధీనం**




హైదరాబాద్: నగరంలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. నాగోల్, కొండాపూర్, మేడ్చల్ కార్యాలయాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ ఫీజుకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వద్ద 150 ప్రింటెడ్ ఆర్సీలు, డీఎల్‌లు.. నాగోల్ కార్యాలయంలో ఏజెంట్ల వద్ద రూ.2.41 లక్షలు, డ్రైవింగ్ స్కూల్ యజమాని సుధాకర్‌రెడ్డి వద్ద 184 డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. ధ్రువపత్రాల మంజూరులో దళారుల పాత్రను ఏసీబీ గుర్తించింది. ఈ అవకతవకలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

### గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ఘర్షణ..

**కిందపడిన ఫిరోజ్‌ఖాన్**



హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ సమక్షంలోనే నేతలు ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హజ్రీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు.

మిగతాది 2లో

# అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్



మిగతాది 2లో

# సంపాదకీయం

## పాలకుల నిర్దేశాలే న్యాయ నిర్ణయాలా?

'న్యాయవ్యవస్థ విశ్వసనీయత కోల్పోతే ఇక మిగిలేదేమీ ఉండదు. స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ జీవ లక్షణం. అది లేకపోతే.. న్యాయమూర్తులు ఉంటారు, కోర్టులు ఉంటాయి, తీర్పులు ఉంటాయి. అయితే వాటి హృదయమూ, ఆత్మ కనుమరుగైపోతాయి' అని జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి) అన్నారు. ఇటీవల పుణేలో వెలువరించిన ఒక స్మారకోపన్యాసంలో కేంద్ర ప్రభుత్వ అభీష్టం మేరకే ఒక హైకోర్టు న్యాయమూర్తిని బదిలీ చేస్తున్నామని కొలీజియం స్వయంగా తన మినిట్స్‌లో రికార్డు చేసిందని కూడా ఆయన వెల్లడించారు. రాజ్యాంగానికి నిబద్ధమై స్వతంత్రంగా వ్యవహరించాల్సిన న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఒత్తిడికి లోనవుతూ పనిచేస్తోందని అనడానికి అది ఒక స్పష్టమైన నిదర్శనం.

'న్యాయవ్యవస్థ పార్టీ రాజకీయాలకు దూరంగా, దృఢ చిత్తంతో వ్యవహరించాలి. ప్రభుత్వంలో మార్పులకూ, న్యాయవ్యవస్థకూ ఏ మాత్రం సంబంధం ఉండకూడదు. అది అందరి పట్లా సదుద్దేశం, సానుభూతితో వ్యవహరించాలి కాని ఎవరి పక్షానా కొమ్ముకాయకూడదు' అని సుప్రీంకోర్టు ప్రారంభ సమావేశంలో తొలి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరిలాల్ జె కానియా ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచిపోయాయి. అది ఎలా అమలువుతుందని సమీక్షించుకుంటే సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణాలు సమున్నతమయ్యాయా లేక దిగజారిపోయాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.నిజానికి మన రిపబ్లిక్ చరిత్రలో మొదటి పాతికేళ్లవరకు న్యాయవ్యవస్థ తన ఉనికిని కాపాడుకునేందుకు, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పరిధిని నిర్ణయించడంలో తన వంతు బాధ్యతను నిష్పాక్షికంగా నిర్వర్తించింది. ముఖ్యంగా అధికరణలు 14, 15, 19, 31లను సుప్రీంకోర్టు నిర్వచించింది. ప్రాథమిక హక్కులను మార్చేందుకు ఏ మాత్రం వీలు లేదని 1967లో గోలక్‌నాథ్ కేసులో స్పష్టం చేస్తే, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని 1973లో కేశవానంద భారతి కేసులో మరింత తేటతెల్లం చేసింది. 1971లో అఖండమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ న్యాయవ్యవస్థతో చెలగాటమాడారు. ఆమె చర్యలకు వత్తాసు పలికిన న్యాయవ్యవస్థ పతనానికి పరాకాష్ఠ ఏడీఎం జబల్పూర్ కేసు. వేలాది రాజకీయ ప్రత్యర్థులను, జర్నలిస్టులను అరెస్టు చేసినప్పుడు ప్రజలు తమ ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చా అని అడిగితే సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అత్యంత దుర్మార్గమైన తీర్పు వెలువరించింది. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు ఆర్టికల్ 21 క్రింద జీవించే హక్కే లేదని ఆ ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు-- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎన్ రే, జస్టిస్ పి.భగవతి, జస్టిస్ ఎంహెచ్ బేగ్, జస్టిస్ వై.వి.చంద్రచూడ్ (రెండేళ్ల క్రితం సీజేఐగా రిటైరైన డివై చంద్రచూడ్ తండ్రి)-- ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. 'ఎమర్జెన్సీ పేరిట కాల్చి చంపినా అడగకూడదంటారా?' అని ఈ కేసులో నిరసన తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా ప్రశ్నించినప్పుడు 'మిలార్డ్, చట్టం అదే చెబుతున్నది' అని నాటి అటార్నీ జనరల్ జవాబిచ్చారట!

న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటి రోజులు అనదగిన ఎమర్జెన్సీ తర్వాత సుప్రీంకోర్టు ఎన్నో ఆత్మవిమర్శలు చేసుకుంది. ఎన్నో దిద్దుబాటు చర్యలను తీసుకుంది. ఎమర్జెన్సీ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ రాజ్యాంగమే సుప్రీం అని ప్రకటించింది. అనేక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు అవకాశం కల్పించింది. జైలులో విచారణ లేకుండా కునారిల్లుతున్న వేలాది ఖైదీలను విడుదల చేసింది. కట్టుబానిసలను విముక్తి చేసింది. న్యాయవ్యవస్థలో నియమాకాలకు కొలీజియం పద్ధతిని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రజల హక్కులను, పర్యావరణాన్ని, పనిచేసే మహిళల ప్రయోజనాలను పరిరక్షించింది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా గద్దె దించడాన్ని అడ్డుకున్నది. చట్టసభల్లోనే ప్రభుత్వాలు మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించింది. వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీల ప్రయోజనాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులెన్నో. ఒక దశలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అబ్బురపరిచేలా కనపడింది.

ఇవాళ ఎమర్జెన్సీ రోజులు లేకపోవచ్చు. కాని న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయి. జస్టిస్ ఉజ్వల్ భుయాన్ లాంటి న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో ఎవరూ చొరబడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉన్నదని, న్యాయమూర్తుల రాజకీయ, సైద్ధాంతిక అభిప్రాయాలు బెంచ్‌లో నిర్ణయాలను ప్రభావితం చేయకూడదని అన్నారంటే తరిచి చూసుకోవాల్సిన అవసరం ఉన్నది. న్యాయమూర్తులు బయటి నుంచి వచ్చే ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదని, తమకొచ్చే ఆదాయంతో తృప్తిగా జీవించలేని న్యాయమూర్తులను వ్యవస్థనుంచే తొలగించాలని మరో ప్రస్తుత సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. ఒక కళంకిత న్యాయమూర్తి వ్యవస్థకే మచ్చలాంటి వాడని ఆమె వ్యాఖ్యానించారు. 'నిష్పాక్షికత న్యాయవ్యవస్థ ఆత్మ, స్వతంత్రత న్యాయవ్యవస్థ నరాల్లో ప్రవహించే రక్తం' అని ఒడిషా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధరన్ అన్నారు.

## అమెండెడ్ భారత్‌నెట్‌పై కేంద్రంతో సీఎం రేవంత్ చర్చ

మొదటిపేజీ తరువాయి

అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై కేంద్రమంత్రితో సీఎం ప్రస్తావించారు. దీనిపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## నాయకులు, కార్యకర్తలు ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు: పల్లా శ్రీనివాసరావు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మహానాడు ప్రారంభం సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు.. ఇప్పటి వరకూ పార్టీ ప్రయాణం, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఇతర అంశాలను ఈ వేదిక ద్వారా చర్చించుకుందామన్నారు. హైబ్రిడ్ విధానంలో మహానాడు 2026 ద్వారా లక్షల సంఖ్యలో నేతలు, కార్యకర్తలు అనుసంధానమై ఉన్నారని తెలిపారు. దేశంలో వివిధ రాజకీయ పార్టీలు వచ్చి కాలగర్భంలో కలిసి పోయాయని, తెదేపా ఒక్కటే నిత్యచైతన్యంతో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలందరికీ అవకాశాలు కల్పిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే అన్ని నామినేటెడ్ పదవులూ కార్యకర్తలకు ఇచ్చామని, భవిష్యత్తులోనూ ఇంకా వస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్-2047 రూపొందించారన్నారు. 63 శాతం యువతకు పార్టీలో ప్రాధాన్యత దక్కుతోందన్నారు. 26 ఏళ్లకే రామ్మోహన్ నాయుడు ఎంపీ, తర్వాత కేంద్రమంత్రి అయ్యారన్నారు. గంటి హరీష్ 27 ఏళ్లకు ఎంపీ అయ్యారని వివరించారు. గతంలో అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు లాంటి నేతలు చిన్నవయసులోనే పార్టీలో కీలక నేతలుగా ఎదిగారని పల్లా శ్రీనివాసరావు గుర్తుచేశారు.

## 'మృతదేహాన్ని ఎవరెస్ట్‌పైనే వదిలేస్తాం'.. హైదరాబాదీ పర్వతారోహకుడి కుటుంబం

మొదటిపేజీ తరువాయి

గతవారం పర్వతారోహణ ముగించుకొని దిగువకు వస్తుండగా ఎవరెస్ట్ (వీ జుజవతీవర్)పై హైదరాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు అరుణ్ కుమార్ తివారీ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాన్ని పర్వతంపైనే వదిలి వేయాలని నిర్ణయించుకున్నట్లు అతడి కుటుంబసభ్యులు వెల్లడించారు. మృతుడి బావమరిది సుధీర్ ఉపాధ్యాయ మాట్లాడుతూ.. శివుని నివాసమైన పర్వతాలలో అరుణ్ కుమార్ ప్రాణాలు వదిలారు కాబట్టి అక్కడే వదిలేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు చేపట్టే ప్రక్రియలు ముగిసే సరికే మృతదేహం చాలా దెబ్బతింటుందని.. మంచులో నుంచి దానిని తీసే ప్రక్రియ కూడా చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. అందువల్ల ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎవరెస్ట్ యాత్రను నిర్వహించిన నేపాల్‌కు చెందిన పయనీర్ అడ్వెంచర్స్ డైరెక్టర్ నివేశ్ కర్కి మాట్లాడుతూ 2025లో కూడా ఎవరెస్ట్ అధిరోహించడానికి తివారీ ప్రయత్నించగా.. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో 7200 మీటర్ల ఎత్తు నుంచి వెనుదిరిగినట్లు పేర్కొన్నారు. గత వారం ఎవరెస్ట్‌ను విజయవంతంగా అధిరోహించి కిందకు దిగుతుండగా అస్వస్థతకు గురై శిఖరానికి కొంచెం దిగువన ఉన్న హిల్లరీ స్టెప్ (డెత్ జోన్) సమీపంలో కన్నుమూసినట్టు పేర్కొన్నారు. అది చాలా ఎత్తులో ఉన్నందున అక్కడి నుంచి మృతదేహాన్ని కిందకు తీసుకురావడం చాలా ప్రమాదకరమైన.. ఖరీదైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ఘర్షణ..

మొదటిపేజీ తరువాయి

ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

## అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

మొదటిపేజీ తరువాయి



భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబానగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

## ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫ్లోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## మహిళలకు టిడిపి పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

## ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఉత్తరాఖండ్, గుజరాత్ తర్వాత దీనికి ఆమోదం తెలిపిన మూడో రాష్ట్రంగా నిలిచింది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల (ఆర్టికల్ 44) ప్రకారం.. దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలనేది దీని ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ (ఎఱఎఖొత్ఖు దీఱంఖు ఝతీఖు) మాట్లాడుతూ.. యూసీసీ అమలుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ చట్టం అమలుపై సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. యూసీసీ అమలుతో సమాజంలో చాలా విషయాల్లో ఏకరూపత వస్తుందన్నారు. మహిళలను రక్షించడం, వారి గౌరవం, సమానత్వాన్ని నిర్ధరించడం ఈ బిల్లు లక్ష్యమని పేర్కొన్నారు.

కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడులు

యూసీసీలోని కీలక అంశాలు!

వివాహం, విడాకులు, ఆస్తుల వారసత్వం, ఆస్తి వీలునామాల రూపకల్పన వంటి అంశాల్లో లింగ సమానత్వాన్ని సాధించేలా ఉంటుంది.

మతాలతో సంబంధం లేకుండా సమానత్వాన్ని సాధించేందుకు దోహదం చేయనుంది.

సహజీవన సంబంధాలను క్రమబద్ధీకరించే నిబంధనలను యూసీసీలో పొందుపరిచారు. సహ జీవనం చేస్తున్నవారు ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఇందుకోసం ప్రభుత్వం తరఫున ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

అన్ని మతాలకు చెందిన స్త్రీ, పురుషులకు కనీస వివాహ వయస్సు ఒకేలా ఉంటుంది.

అన్ని మతాల్లో బహుభార్యత్వంపై నిషేధం

హలాల్ విధానంపై నిషేధం

ఇది ఓ రాజకీయ అజెండా: కాంగ్రెస్

భాజపా తమ రాజకీయ అజెండాలో భాగంగా ఈ చట్టాన్ని చేసిందని కాంగ్రెస్ (జశీఅస్త్రతీవంం) ఆరోపించింది. యూసీసీలో పొందుపరిచిన బాల్య వివాహాలు, విడాకులు, భరణం, బహుభార్యత్వం వంటి సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయని కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత వాజెద్ అలీ చౌదరి పేర్కొన్నారు. వాటి కోసం కొత్త చట్టాన్ని అమల్లోకి తేవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యం కాదని.. ఆదివాసీలను మినహాయించే ఈ చట్టాన్ని ఏకరీతి చట్టం అని ఎలా అంటామని ప్రశ్నించారు.

## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటిపేజీ తరువాయి

తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్‌ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు.

# సదాశివపేట లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.

**•రూ.93 లక్షల తో సదాశివపేట పట్టణం లో నూతనంగా ఏర్పాటు చేయబోయే విద్యుద్దీపాలకు శంకుస్థాపనలి**

**•మాలపాడు గ్రామం లో మహిళా శక్తి భవన పనుల ప్రారంభం.**

**సంగారెడ్డి, మే 27,మన మహతి న్యూస్ :**
టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి బుధవారం సదాశివపేట లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సదాశివపేట పట్టణం లోని గాంధీ చౌక్ వద్ద ౧ఖఫీ×ఙజ నిధుల తో " కోహీర్ బేస్ నుండి దుర్గమ్మ దేవాలయం మరియు ఆత్మకూర్ గొని నుండి సిద్దాపూర్ గొని వరకు రూ.93.00 లక్షల తో ఏర్పాటు చేయనున్న ఆధునిక విద్యుద్దీపాలకు ౧+××ఙ చైర్ పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం సిద్దాపూర్ ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ పనులు మరియు బక్రీద్ పండుగకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ ,వైస్ చైర్ పర్సన్ రేణుక చిరంజీవి, కౌన్సిల్ సభ్యులు, పట్టణ ముఖ్య నాయకులు, మున్సిపల్ కమిషనర్ మరియు పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



### మాల పాడు గ్రామం లో సమైక్య భవనానికి శంకుస్థాన

సదాశివపేట మండలంలోని మాలపాడు గ్రామంలో ఇందిరా మహిళాశక్తి భవనం నిర్మాణ పనులను నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధి మరియు స్వయం ఉపాధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం డ్వాక్రా రుణ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ సంతోష్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు యశ్వంతరావు, రవికుమార్, కాంగ్రెస్ నాయకులు మధు, చారి, గోపాల్ నర్సింలు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు



నాగరాజు గౌడ్, గ్రామ సెక్రటరీ, మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### మండల సమాఖ్య సమావేశం లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

సదాశివపేట మండల సమైక్య కార్యాలయం నందు ప్రజా పాలనలో భాగంగా మండల సమైక్య ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో గత సంవత్సరం నుండి ఈ సంవత్సరం వరకు చేపట్టిన కార్యక్రమాల పైన చర్చించారు.అలాగే మహిళా శక్తి క్రింద అమలవుతున్న కార్యక్రమాలు తీఏ బస్సు మరియు జీవనోపాదులు ప్రణాళికలు పెట్రోల్ బంక్ జెండర్ కార్యక్రమాలు మొదలైన అంశాల గురించి చర్చించారు.
ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి జఐజ చైర్మన్ గసిద్దన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు , శ్రీనివాస్ మండల అధ్యక్షులు వివిధ వివిధ గ్రామాల సర్పంచులు హాజరయ్యారు.

# గబ్బిలాలపేట హత్య కేసు ఛేదించిన పోలీసులు.. ప్రధాన నిందితుడు అరెస్ట్

**•కూలి డబ్బుల వివాదం హత్యకు దారి.. మరో నిందితుడు రోహిత్ కోసం గాలింపు**

**• మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో అనిల్ కుమార్ మృతి**

**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మే 27**

గబ్బిలాలపేట దొండ తోటలో గుర్తుతెలియని మృతదేహంగా లభించిన వ్యక్తిని అనంతరం అనిల్ కుమార్‌గా పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఇంటి యజమాని అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్య కేసును ఛేదించి ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం, నమ్మదగిన సమాచారం



ఆధారంగా తేదీ 26-05-2026న రాజ్పుత్ అజయ్ రాయ్ అలియాస్ జీనత్ (30), స్వస్థలం మహారాజ్‌గంజ్ జిల్లా, ఉత్తరప్రదేశ్, ప్రస్తుతం పెయింటింగ్ పని చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో అతడు అనిల్ కుమార్‌ను హత్య చేసినట్లు అంగీకరించాడు.
తేదీ 18-05-2026న అనిల్ కుమార్, అజయ్ రాయ్ ఇద్దరూ కలిసి దావత్‌కు వెళ్లి మద్యం సేవించిన అనంతరం అంబేద్కర్ నగర్‌లోని అనిల్ ఇంటికి వచ్చారు. అప్పటికే అక్కడ రోహిత్ అనే వ్యక్తి కూడా మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.
సాయంత్రం సమయంలో అజయ్ రాయ్ తన కూలి డబ్బులు ఇవ్వాలని, ఇంటికి పంపేందుకు రూ.8 వేల రూపాయలు కావాలని అనిల్‌ను అడిగాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన అజయ్ రాయ్ పక్కనే ఉన్న కర్రతో అనిల్ తల, వీపు, వెన్నుపూసపై పలుమార్లు దాడి చేశాడు. అనంతరం రోహిత్ కూడా అదే కర్రతో అనిల్‌పై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.
అనిల్ మృతి చెందినట్లు నిర్ధారించుకున్న అనంతరం ఇద్దరు నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. వెళ్తూ అజయ్ రాయ్ అనిల్ సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అజయ్ రాయ్‌ను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
ప్రధాన నిందితుడు అజయ్ రాయ్‌ను రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న మరో నిందితుడు రోహిత్ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో హైడ్రామా - కుర్చీ కోసం పోరు - బదిలీ అయిన అధికారి మళ్లీ సీట్లోకి

**•ఈ హై డ్రామా వెనుక ఒక నాయకుడు ఉన్నాడని బలంగా ఆరోపణలు !**

**•ఎవరా నాయకుడు ? త్వరలోనే మీ ముందుకు!**

**మన మహతిప్రతినిధి:భ్రమరాంబ**
**తిరువూరు న్యూస్,మే.28**
తిరువూరు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో హైడ్రామా కుర్చీ కోసం పోరు బదిలీ అయిన అధికారి మళ్లీ సీట్లోకి !
తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి!
ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలతో వివాదాస్పదంగా మారిన సబ్‌రిజిస్ట్రార్‌ను జిల్లా యంత్రాంగం ఐజీ కార్యాలయానికి బదిలీ చేసిన విషయం తెలిసిందే!
ఆ స్థానంలో కొత్తగా శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
అయితే కథ ఇక్కడితో ముగియలేదు!
అసలు ట్విస్ట్ ఆ తర్వాతే మొదలైంది
ఖాళీ కుర్చీ కనిపించగానేపాత అధికారి ఎంట్రీ!
నూతన సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావు విధుల్లో ఉండి వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటాన్ని గమనించిన!
బదిలీ అయిన మాజీ సబ్‌రిజిస్ట్రార్ చటుక్కున వచ్చి అదే కుర్చీలో కూర్చోవడం!
కార్యాలయంలో ఉన్న సిబ్బందిని ఆశ్చర్యానికి గురిచేసింది.ఇంతలో తిరిగి వచ్చిన శ్రీనివాసరావు!
తన సీట్లో మరో అధికారి కూర్చోవడం చూసి షాక్‌కు గురి అయిన సబ్ రిజిస్ట్రర్ శ్రీనివాసరావు!
మీరు యాల ఇక్కడ కూర్చున్నారు ? అని ప్రశ్నించగా నన్ను మళ్లీ ఇక్కడికే రీజాయిన్ చేశారు
అని సమాధానం ఇచ్చిన
బదిలీపై వెళ్లిన సబ్ రిజిస్ట్రర్!
మెయిల్ వస్తుంది అంటూ రాత్రి వరకు వేచిచూపులు
దీంతో నూతన అధికారి ఆర్డర్ కాపీ చూపించండి అని అడగగా మెయిల్‌లో వస్తుంది అని సమాధానం ఇచ్చిన బదిలీ అయిన సబ్ రిజిస్ట్రర్ !




ఆ మెయిల్ కోసం రాత్రి 9,గంటల వరకు ఎదురు చూసినట్లు సమాచారం!
ఈ వ్యవహారం బయటకు రావడంతో విలేకరులు కార్యాలయానికి చేరుకుని వివరాలు సేకరించారు!
మాజీ అధికారి మళ్లీ కుర్చీలో కూర్చున్న దృశ్యాలను చిత్రీకరిస్తుండగా ఎందుకు ఫోటోలు తీస్తున్నారు ?
అని ప్రశ్నించారట!
దీనికి మీరు తిరిగి జాయిన్ అవుతున్నారని వార్త రాయాలి అని విలేకరులు చెప్పడంతో
ఆ అధికారిని ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచార ఆరోపణలు!
ఐజీ కార్యాలయానికి సమాచారం అధికారుల్లో గందరగోళం!
ఈ పరిణామాలపై స్థానికులు, విలేకరులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రిలీవ్ కాకుండానే తిరిగి కార్యాలయానికి ఎలా వచ్చారు ?
అన్న ప్రశ్నలు తలెత్తాయి.
వెంటనే కార్యాలయానికి రావాలంటూ సంబంధిత అధికారులకు సమాచారం పంపినట్లు తెలిసింది!
బదిలీ అయిన తర్వాత కూడా అదే కుర్చీ కోసం ఇంత పట్టుదల ఎందుకు ?
తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిజంగా ఏం జరుగుతోంది ?
ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు కథ ఏమిటి ?
అన్నది ఇప్పుడు ప్రజల్లో హాట్ టాపిక్‌గా మారింది!
కుర్చీపై పట్టుదల వెనుక మిస్టరీ ఏమిటి ?
మరికొన్ని నిజాలు మరో సంచికలో

## పెద్ద తండ గ్రామ సంఘాల భవనాల శిలాఫలకం ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**వరంగల్ జిల్లా మే 27 న్యూస్**
సెంగెం మండలం పెద్ద తండా గ్రామంలో గ్రామ సంఘాల భవనాల శిలాఫలకాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరై శిలాఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామ సంఘాల భవనాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.





ఈ కార్యక్రమంలో పెద్ద తండా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గూగులోత్ వినోదరవీందర్ నాయక్ , గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సంఘాల సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్యాపిటల్ అమరావతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో - నంది జాతీయ పురస్కార అవార్డు గ్రహీత

### ఆంధ్ర శకుంతల ఆర్టిస్ట్ భ్రమరాంబ

**మన మహతిప్రతినిధి:భ్రమరాంబ**
**విజయవాడ న్యూస్,మే.28**

క్యాపిటల్ అమరావతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 24.వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి 2026-నంది జాతీయ పురస్కార అవార్డు లు అందించారు.
ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన ఆంధ్ర శకుంతల ఆర్టిస్ట్ భ్రమరాంబ ఎన్నో సినిమాల్లో నటించారు.
ఈ మధ్యకాలంలో తెలుగు రాష్ట్రాల్లో విడుదలై ఘనత చాటుకున్న



చిమట రమేష్ దర్శకత్వం వహించి హీరోగా నటించిన నేను కీర్తన అనే చిత్రంలో జబర్దస్త్ అప్పారావు భారీగా నటించి( తాయారుగా )ఆమె చాటుకున్నారు
ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన వేదికపై నంది జాతీయ పురస్కార అవార్డు గ్రహీతిగా ఎంపికైన ఆంధ్ర శకుంతల ఆర్టిస్ట్ భ్రమరాంబాకు అవార్డు అందించిన క్యాపిటల్ అమరావతి కల్చరల్ సొసైటీ ఫౌండర్ సభ్యులు మరియు ఎన్ఎస్ నాయుడు.

## నేడు మాగనూర్ మండల కేంద్రంలో.పలు కార్యక్రమాల కొరకు మంత్రివర్యులు రాక ...



**మన మహతి.న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.**
మగనూరు మండలంలో రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి మాగనూరు మండలంలోని గజరం దొడ్డి ఉ చిట్యాల వాగు పై నిర్మిస్తున్న 20 కోట్ల బ్రిడ్జి నిర్మాణాన్ని పర్యవేక్షించనున్న రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి
28:05:2026
సమయం:10:00 ఉదయం
ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని సర్పంచులు ఉపసర్పంచులు.వార్డు సభ్యులు.ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ముఖ్యమైన నాయకులు కార్యకర్తలు అభిమానులు పత్రిక మిత్రులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు ఇట్టి కార్యక్రమానికి రావలసిందిగా మిమ్మల్ని అందరిని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నాం..
మీ.ఆనంద్ గౌడ్ మండల.కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు

# గీతంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీ.ఎడ్.2026-27 విద్యా సంవత్సరం నుంచి ఆరంభం

**ఎన్.సి.ఇ.టి.లో అర్హత సాధించడం తప్పనిసరి.**

సంగారెడ్డి, మే 27,మన మహతి న్యూస్ :
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాన్ని)ను ప్రవేశపెట్టనుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా బి.ఎ. బి.ఎడ్., బి.ఎస్సీ. బి.ఎడ్. అనే నాలుగేళ్ల డ్యూయల్–మేజర్ అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందిస్తుందని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. భారతదేశ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 చట్రంలో ఇది భాగమని ఆమె తెలిపారు.



ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ శర్మ వివరిస్తూ, భవిష్యత్తు కోసం అత్యంత అర్హత కలిగిన, బహుళ–విషయ పరిజ్ఞానం గల విద్యావేత్తలను తయారు చేసే లక్ష్యంతో, 12 తరగతి లేదా ఇంటర్మీడియెట్ తరువాత వెంటనే విషయ పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన బోధనా శిక్షణతో అనుసంధానించడానికి సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. పాఠశాల విద్యలోని వివిధ దశలలో ఉన్న విద్యార్థుల కోసం వారి వయస్సుకు తగిన అభ్యాస అనుభవాలను సృష్టించగల ఉత్సాహవంతులైన, వృత్తిపరంగా శిక్షణ పొందిన, సామాజిక బాధ్యత గల ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలియజేశారు.

నాలుగేళ్ల సమగ్ర కార్యక్రమం, కాబోయే ఉపాధ్యాయులకు విషయం, బోధనా పద్ధతులు, విలువలు, తరగతి గది ఆచరణలో సమగ్ర శిక్షణను అందించడమే ప్రధాన లక్షాలుగా డాక్టర్ రిచా పేర్కొన్నారు. ఈ పాఠ్యప్రణాళిక 21వ శతాబ్దపు ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటూనే, బాల్య దశ సంరక్షణ, విద్య (ఈసీసీఈ), ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్), సమ్మిళిత విద్య, భారతీయ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

ఈ సమగ్ర అండర్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం, కొత్త పాఠశాల నిర్మాణంలోని నాలుగు దశలైన– ఫౌండేషనల్, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ (5o3o3o4) కోసం ఉపాధ్యాయులను సిద్ధం చేస్తుందని డాక్టర్ రిచా వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ ఐదేళ్ల మార్గానికి బదులుగా తమ ఉపాధ్యాయ విద్యను నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చని, తద్వారా ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

2026–27 విద్యా సంవత్సరానికి గాను, ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 223 భాగస్వామ్య సంస్థలలో (ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రాంతీయ విద్యా సంస్థ (ఆర్ఐఈ)లు, కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో పాటు గీతంలో కూడా) ఈ కోర్సును అందిస్తున్నారని, దాదాపు 16,950 సీట్లు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రిచా శర్మ పేర్కొన్నారు. జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్.సి.ఇ.టి.) 2026 ద్వారా ఈ కోర్సులో ప్రవేశాలను నిర్వహిస్తారని, ఈ పరీక్షలో సాధించిన అర్హతను బట్టే ఆయా సంస్థలు ప్రవేశాలు కల్పిస్తాయని తెలిపారు.

మరిన్ని వివరాల కోసం, ఆసక్తి గల విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు 95 42 42 42 59 / 66 లను సంప్రదించాలని, లేదా గీతం అధికారిక వెబ్ సైట్ ఝఝఝ.స్త్రఱ్ఖఎ.వసబ ను సందర్శించాలని డాక్టర్ రిచా సూచించారు.

## టీజీపాలీసెట్-2026 అడ్మిషన్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల :ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్

రుద్రంపూర్, మే 18 మన మహతి న్యూస్



తెలంగాణ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీపాలీసెట్–2026 అడ్మిషన్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్టు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ మే 27 నుంచి ప్రారంభం కానుంది. మే 27 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో బేసిక్ సమాచారం నమోదు, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, హెల్ప్‌లైన్ సెంటర్ ఎంపిక కోసం స్లాట్ బుకింగ్ నిర్వహించనున్నారు. మే 29 నుంచి జూన్ 1 వరకు సర్టిఫికెట్ ధృవీకరణ చేపట్టనుండగా, జూన్ 3 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. జూన్ 6న సీట్ల కేటాయింపు ప్రకటించి, జూన్ 9 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది.

తుది దశ కౌన్సెలింగ్ జూన్ 15 నుంచి ప్రారంభమవుతుంది. మొదటి దశలో హాజరుకాని అభ్యర్థులకు మరో అవకాశం కల్పిస్తూ జూన్ 15న స్లాట్ బుకింగ్, జూన్ 16న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. జూన్ 20న తుది సీట్ల కేటాయింపు చేపట్టి, జూన్ 24 నాటికి కళాశాలలు జాయినింగ్ వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.

అంతర్గత స్లైడింగ్ , స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా అధికారులు విడుదల చేశారు. జూలై 1న స్పాట్ అడ్మిషన్ మార్గదర్శకాలు ప్రకటించి, జూలై 8 వరకు స్పాట్ అడ్మిషన్లు పూర్తి చేయనున్నారు.

అభ్యర్థులు వీలైనంత త్వరగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. పూర్తి వివరాలు, హెల్ప్‌లైన్ కేంద్రాల జాబితా, కోర్సుల వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు

## ఆలస్యంగా ఎలుగులోకి వచ్చిన దర్జా భూకబ్జా - ఒక విఆర్ఓ కి 10, లక్షలు ఆఫర్ ఇచ్చిన ఒక నాయకుని దర్జా భూకబ్జా

**సర్వే నెంబర్ 301- సుమారుగా 100,ఎకరాల్లో నాలుగు ఎకరాల భూమి కబ్జా!**
**నాకు సగం - నీకు సగం - వీఆర్వో కి 10, లక్షలు బంపర్ ఆఫర్ ఇచ్చిన దర్జా భూ కబ్జాదారులు !**




మన మహతిప్రతినిధి:భ్రమరాంబ
ఏ. కొండూరు న్యూస్,మే.28
ఏ.కొండూరు మండలం గోపాలపురంలో ఆలస్యంగా ఎరుగులోకి వచ్చిన 100 ఎకరాల భూములో 4,ఎకరాల దర్జా భూకబ్జా. సర్వే నెంబరు 301,గోపాలపురం భూమి సదరు నూజివీడు వారి పూర్వీకుల ఆస్తి ఏ సర్వే నెంబరు తెలియక 4,ఎకరాల భూమిని వదిలేసిన పరిణామములు హైదరాబాదుకు చెందిన ఒక బడా బాబు తన ధన బలముతో. రాజకీయ బలముతో మరియు లోకల్ సపోర్టు కోసం తెలుగుదేశం పార్టీలో ఒక ఎక్స్ నాయకుడిని సంప్రదించి కలుపుకొని ఆ 4.ఎకరాల్లో భూమిని కబ్జా చేయాలని పన్నాగాలు పన్నుతున్న వైనం. ఆ భూమి ప్రస్తుతం నాలుగు కోట్లు విలువ పలుకుతుండగా లోకల్ విఆర్వో సహకారంతో గత రెండు సంవత్సరాల నుండి ఆ భూమిని తనకు వచ్చే విధముగా సొంతం చేసుకోవాలని తహతహలాడుతున్న దర్జా కబ్జాదారుడు నేటి కూటమిలో ఉన్న నాయకుడు హైదరాబాదుకు చెందిన ఒక బడా బాబు ప్రస్తుతం జరుగుతున్న తరుణంలో కూడా ఆ భూమిని సగం హైదరాబాదుకు చెందిన బడా బాబుకి మరో సగం ఏ.కొండూరు మండలానికి చెందిన ఎక్స్ నాయకుడు ప్రస్తుత కూటమిలో ఉన్నటువంటి ఒక నాయకుడు సర్వే కాకముందే వాటాలు పంచుకున్న మహా కబ్జానా దారులు. అదేవిధంగా గతంలో కూడా ఎన్నో భూములను కబ్జా చేసిన వారికి అక్రమ భూములను అంట కట్టి పలు పర్యాయాలు సస్పెండ్ అయినటువంటి ఒక విఆర్ఓకి 10, లక్షలు బంపర్ ఆఫర్ ఇచ్చిన దర్జా భూ కబ్జాదారులు. మరికొన్ని నిజాలు మరో సంచికలో

## స్త్రీనిధి రుణాల్లో వ్యాపారాలకు ప్రాధాన్యం

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.



స్త్రీనిధి పథకం ద్వారా సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు సువిధ, అక్షర పేరుతో ప్రత్యేక రుణాలు అందిస్తున్నారు. పాల డెయిరీ, గొర్రెల పెంపకం, ఆహారశుద్ధి, ఎలక్ట్రిక్ వాహనాలు, టైలరింగ్, చిన్న వ్యాపారాలతో పాటు ఇంటి మరమ్మత్తులు, సౌరవిద్యుత్ ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 40 వేల నుంచి 5 లక్షల వరకు రుణాలు అందుతాయి. 2026–27కు నారాయణపేట జిల్లాకు 41.20 కోట్ల లక్ష్యం కేటాయించారు.

## నారాయణపేటజిల్లా డయల్ యువర్ ఎస్పీకి 18 ఫిర్యాదులు




మన మహతి న్యూస్ ప్రతినిధి.
నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి 18 మంది బాధితులు ఫోన్ చేసి సమస్యలు తెలియజేశారు. బెల్టు దుకాణాలు మూసివేయడం, భూ తగాదాలు, గ్రామాల్లో పెట్రోలింగ్ పెంచడం వంటి అంశాలపై ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

## ధోతి మరియు హాఫ్ సారీ ఫంక్షన్ కు హాజరై శు భాకాంక్షలు తెలిపిన బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్



హనుమకొండ జిల్లా మే 27 న్యూస్

ఈరోజు హనుమకొండ రాధా గార్డెన్ లో భానోత్ విజయలక్ష్మి హరిలాల్ కుమార్తె అల్లుడు గుగులోతు స్రవంతి శ్రీనివాస్ నాయక్ ధోతి శారీ ఫంక్షన్ బానోత్ విజయలక్ష్మి హరిలాల్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి హాజరై వైభవు నాయక్, అక్షర నాయక్ కు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, ఎం రఘురాం ఈ ఈ ఇరిగేషన్, రాజేందర్ రిటైర్డ్ ఎస్ సి ఆర్ అండ్ బి, ఎం రమేష్ ఆర్టీసీ డిపార్ట్మెంట్, జే బాలు నాయక్ ఎక్స్చేంజ్ డిపార్ట్మెంట్, డి జగ్రామ్ నాయక్ రిటైర్డ్ జిసిసి మేనేజర్, రాజు నాయక్ హెచ్ఎం, ఎం సమ్మయ్య జిసిసి మేనేజర్ మరియు బంధుమిత్రులు ముఖ్య నాయకులు పాల్గొని ఆశీర్వదించడం జరిగింది

## అక్రమ రవాణాపై చింతలపాలెం పోలీసుల నిఘా

చింతలపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు అంతరాష్ట్ర సరిహద్దు వద్ద బక్రీద్ పండుగ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎస్ఐ పరమేష్ ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ, కట్టడి ముట్టడి తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనం, వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ గోవులు, పశువుల అక్రమ రవాణా, గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిరోధంపై నిఘా పెట్టినట్లు తెలిపారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. ప్రజల భద్రతే తమ లక్ష్యమని, పోలీస్ అంటే ధైర్యం, భరోసా అని ఎస్ఐ పరమేష్ పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై అవగాహన



మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.
మక్తల్ లో ని అతిథి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. జూన్ 2న నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఘనంగా ఎగరవేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని సూచించారు. ఈపార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ శిబిరాన్ని సందర్శించిన ఏసీఎంఓ కే. రమేష్



పాల్వంచ మే 27, మన మహతి న్యూస్
ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాల్వంచలో నిర్వహిస్తున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ శిబిరాన్ని ఐటిడిఎ భద్రాచలం ఏసీఎంఓ కే. రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధన విధానాన్ని పరిశీలించి, చదువులో వెనుకబడిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివితే తప్పకుండా విజయం సాధించవచ్చని తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలను తెలుసుకుని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ప్రతి అంశాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# చునరీ... చునరీ రీమిక్స్ గీతం

హిందీ సినిమా 'బీవీ నెం.1'(1999)లోని 'చునరీ చునరీ' అనే గీతంతో యువతని విశేషంగా ఆకట్టుకున్నారు బాలీవుడ్ అగ్రతార సల్మాన్ ఖాన్, సుస్మిత సేన్. ఇప్పుడీ పాటకి రీమిక్స్ గీతంలో ఇద్దరు నాయికలతో కలిసి స్టెప్పులేస్తూ అలరించడానికి సిద్ధమయ్యాడు హీరో వరుణ్ ధావన్. ఆయన, కథానాయికలు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో రాబోతున్న చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈ చిత్రంలో బాలీవుడ్ ఐకానిక్ గీతం 'చునరీ చునరీ'ని రీమేక్ చేశారు. ఈ సినిమా జూన్ 5న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ఈ పాటని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. 'ఎగిరే పక్షి ఎగురుతూనే ఉంది.. కానీ నా మనసే గాలిపటంలా నిన్నే కలవరపెడుతోంది ఇదేంటి?' 'నా ప్రియతమా నీకెలా చెప్పాలి' లాంటి లిరిక్స్‌తో సాగే ఈ గీతం వరుణ్, పూజా, మృణాల్‌ల కెమెస్ట్రీతో ఆకట్టుకుంటోంది. ఈ పాటని సింగ్, జోనితా గాంధీ, అనురాధ శ్రీరామ్ తదితరులు కలిసి ఆలపించారు. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రమేశ్ తౌరనీ నిర్మించారు. మౌనీరాయ్, చంకీ పాండే, జిమ్మి షెర్గిల్ తదితరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు.

# నాయికా ప్రాధాన్య చిత్రంలో మమిత!



'ప్రేమలు' సినిమాతో యువతరాన్ని తన ప్రేమ మాయలో పడేసింది మమితా బైజు. త్వరలో ఆమె 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'జన నాయగన్' లాంటి భారీ చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఇప్పుడామె తన తొలి నాయికా ప్రాధాన్య చిత్రాన్ని పట్టాలెక్కించినట్లు సమాచారం. 'లవ్‌టుడే', 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన యువ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ చిత్రంతో నిర్మాతగా మారుతున్నట్లు తెలిసింది. ఆయన వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన కుర్రాడు దీనికి దర్శకత్వం వహించనుండగా.. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఇటీవలే చెన్నైలో లాంఛనంగా మొదలైందని.. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం.

# 'ధురంధర్' ప్రొడక్షన్ డిజైనర్‌పై లైంగిక వేధింపుల కేసు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. తాజాగా ఈ చిత్రానికి వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్ సైనీ జోహ్రేపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



గతేడాది సెప్టెంబర్ 10న సినిమాకు సంబంధించిన చర్చల కోసం సైనీ తనను చండీగఢ్‌లోని ఒక హోటల్‌కు రావాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. తాను అనారోగ్యానికి గురైనప్పటికీ, అక్కడి నుండి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే కెరీర్ దెబ్బతింటుందని నిందితుడు బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆ మాట చెప్పడానికి నేను భయడపను



ప్రస్తుతం ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. తాను ఈ మాట చెప్పడానికి భయపడనన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త వాళ్లతో సినిమా చేస్తే విజయం వస్తుందని తాను నమ్ముతానంటూ.. సమ్మర్ హాలీడేస్ మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

"ఇండస్ట్రీ ప్రస్తుతం చాలా కష్టకాలంలో ఉందని చెప్పడానికి చాలా మంది భయపడతారు. నేను ఈ విషయాన్ని ధైర్యంగా చెప్పగలను. ప్రేక్షకులను థియేటర్‌లకు తీసుకురావడమే మనందరికీ ఇప్పుడు సవాల్. సమ్మర్ హాలీడేస్ లాంటి సినిమాలు తీసి ఆడియన్స్‌ను థియేటర్‌కు తీసుకురండి. అప్పుడు ఆటోమేటిక్‌గా మంచి సినిమాలు నిలబడతాయి. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. కొత్త దర్శకులందరూ మంచి చిత్రాలు తీసి ఇండస్ట్రీని నిలబెట్టండి. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది" అని అన్నారు.

"చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్ ఇంత సంతోషంగా జరగడం చూస్తున్నాను. ఈ విషయంలో నిర్మాతలను అభినందించాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఏ ఈవెంట్ కూడా ఇంత అద్భుతంగా జరగలేదు. థియేటర్‌లలో కూడా సందడి కనిపించడం లేదు. ఈ 'సమ్మర్ హాలీడేస్'తో థియేటర్‌లలో సందడి నెలకొనాలని కోరుకుంటున్నా" అని దిల్‌రాజు తెలిపారు.

# 17 ఏళ్ల తర్వాత పెద్ది కోసం ఫిల్మ్ నెగెటివ్‌ను వాడాం: డీవోపీ రత్నవేలు



"పెద్ది' చిత్రంలో క్రికెట్ మ్యాచ్ స్క్రీన్‌పై చూస్తుంటే రెండు జట్ల మధ్య యుద్ధంలా అనిపిస్తుంది. రామ్ చరణ్ సెటిల్డ్ ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చారు. ఆయన ఇంటెన్సిటీని ప్రేక్షకులు ఖచ్చితంగా ఎక్స్‌పీరియన్స్ చేస్తారు' అని చెప్పారు డీవోపీ రత్నవేలు. రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు సానా డైరెక్షన్‌లో వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం జూన్ 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా డీవోపీ రత్నవేలు ఇలా ముచ్చటించారు.

కొవిడ్ తర్వాత సినిమా ట్రెండ్ మారింది. ప్రేక్షకులు రియలిజాన్ని కోరుకుంటున్నారు. అందుకే 'పెద్ది' కోసం రియలిస్టిక్ ఫీలింగ్ ఉన్న విజువల్స్‌ను క్రియేట్ చేశాం. నలభై ఏళ్ల క్రితంనాటి విజయనగరం కథను విజువల్‌గా ఎంత అందంగా చెప్పాలనేది ముందుగా ప్లాన్ చేశాం. అప్పటి ప్రజలు ఒక కలర్‌ను ఎక్స్‌పీరియన్స్ చేసి ఉంటారు. ఆ ఫీల్‌ను రీ క్రియేట్ చేయడానికి ప్రయత్నించాం. చివరి ఫ్రేమ్ వరకు కనెక్ట్ అయ్యేలా ఒక మూడ్ క్రియేట్ చేశాం.

సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. కథలో అదొక పెద్ద మలుపు. దాన్ని నైట్ ఎఫెక్ట్‌లో చేద్దామని బుచ్చిబాబుకు సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. షూటింగ్ తర్వాత చరణ్ గారు వచ్చి "అద్భుతమైన ఆలోచన, ఈ సీన్‌తో సినిమా నెక్స్ట్ స్టేజ్‌కు వెళ్లింది' అని చెప్పడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

కుస్తీ పోటీలు మరో పెద్ద ఛాలెంజ్. కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్‌తో పాటు ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి. చరణ్‌లో ఒక హనుమంతుడిని ఫీల్ అవుతారు. తన ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా అద్భుతం. ఒక కథను 60 శాతం స్క్రీన్ మీదకు తెస్తే సూపర్ హిట్ అంటారు. కానీ బుచ్చిబాబు 200 శాతం స్క్రీన్ మీదకు తీసుకొచ్చారు.


ఢిల్లీలో తీసిన సీన్స్ నాకు చాలా ఫేవరెట్. లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం దాదాపు 17 ఏళ్ల తర్వాత తెలుగులో మళ్లీ ఫిల్మ్ నెగెటివ్‌ను ఉపయోగించాం. డిజిటల్ కెమెరాల ఔట్‌పుట్ బాగున్నా, ఒక రియల్ ఫీల్ కోసం ఫిల్మ్ నెగెటివ్ వాడాం. శ్రీలంకలో ఇంతవరకూ ఎవరూ షూట్ చేయని లొకేషన్స్‌లో షూట్ చేశాం. అక్కడి రైల్వే ట్రాక్ మమ్మల్ని ఎగ్జైట్ చేసింది. అక్కడో వాటర్‌ఫాల్ సీక్వెన్స్ కూడా ఉంది. 'పెద్ది' క్లైమాక్స్ చాలా ఛాలెంజింగ్. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు.

ఇక త్వరలో డైరెక్షన్ చేయబోతున్నా. ఇప్పటికే మూడు కథలు రాశా. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్ తీస్తా.

## మంచు మనోజ్ మంచి మనసు..
# అనాథాశ్రమాన్ని సందర్శించిన నటుడు

నటుడు మంచు మనోజ్ పెద్ద మనసు చాటుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆశ్రమాన్ని సందర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 'మాతృదేవోభవ' అనాథాశ్రమాన్ని సందర్శించి ఆయన అక్కడ మతిస్థిమితం సరిగ్గా లేని ఒక వ్యక్తికి నిర్వాహకులతో కలిసి హెయిర్ కటింగ్ చేశారు. అనంతరం కొత్త దుస్తులు ఇచ్చారు. ఆశ్రమానికి అవసరమైన టేబుళ్లు, కుర్చీలను విరాళంగా అందజేశారు.

సమాజంలో ఎవరూ లేనివారికి అండగా నిలవడం గొప్ప విషయమని మనోజ్ అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఆశ్రమానికి తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు నెలల క్రితమే 'మాతృదేవోభవ' అనాథాశ్రమం నిర్వాహకులు తనను సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ వీడియో పెట్టారని అది చూసి చలించిపోయినట్లు చెప్పారు. తాను రిహాబిలిటేషన్




సెంటర్ స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఇక ఇటీవలే మనోజ్ తన భార్యతో కలిసి ఐక్య సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రజల గొంతుకగా ఉండేందుకు దీన్ని ప్రారంభించినట్లు చెప్పారు. దీని కార్యకలాపాల కోసం సొంత నిధులనే వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానం, చిన్నారుల దత్తత.. సహా పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వెల్లడించారు.

# రణ్‌వీర్ 'డాన్ 3' వివాదం వేళ.. తెర పైకి దీపిక 'రేస్ 2'

ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది 'డాన్ 3' చిత్రం. దీనిచుట్టూ కొనసాగుతున్న చర్చల మధ్య రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణెకు సంబంధించిన పాత వివాదం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. 2012లో జరిగిన 'రేస్ 2' ఘటనను నెటిజన్లు గుర్తుచేసుకుంటున్నారు.

'రేస్ 2' షూటింగ్ సమయంలో దీపికా పదుకొణె ప్రవర్తనపై నిర్మాత రమేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన విషయం అప్పట్లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. ఆరు రోజుల షూటింగ్ అనంతరం ఆమె అకస్మాత్తుగా సినిమా నుంచి వైదొలగారని ఆయన ఆరోపించారు. ఆమె డేట్స్‌కు అనుగుణంగా షూటింగ్ షెడ్యూల్స్ మార్చాల్సి వచ్చిందన్నారు. అయినా చివరి నిమిషంలో ప్రాజెక్ట్ నుంచి వైదొలగడం వల్ల యూనిట్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాగే సమావేశాలకు హాజరుకాకపోవడం, ఫోన్ కాల్స్,



మెసేజ్‌లకు స్పందించలేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "నా 25 ఏళ్ల సినీ ప్రయాణంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు" అంటూ ఆమె వ్యవహార శైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమెకు వృత్తిపై అంకితభావం లేదన్నారు.

ఆ సినిమా నుంచి దీపిక వైదొలగడంతో చిత్రబృందం ఆమెపై సినీ సంఘాలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. తనకు ఇంతకుమించిన మార్గం లేదని నిర్మాత అప్పట్లో మీడియాతో వెల్లడించారు. దీంతో దీపిక నిర్మాతలతో చర్చలు జరిపి తిరిగి ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. అయితే కొత్త నిబంధనలతో ఆమె 'రేస్ 2' పూర్తి చేశారు. 2013లో విడుదలైన ఈ సినిమా కమర్షియల్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం 'డాన్ 3' చర్చల మధ్య ఈ పాత వివాదం మళ్లీ వెలుగులోకి రావడం బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది.

రణ్‌వీర్ సింగ్ బ్యాన్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' చీఫ్ అడ్వైజర్ తాజాగా స్పష్టతనిచ్చారు. అది అధికారిక బ్యాన్ కాదని స్పష్టంచేశారు. నటులపై నిషేధం విధించే అధికారం తమకు లేదని తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించేవరకూ ఆయనతో కలిసి పని చేయొద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సభ్యులను ఆదేశించామన్నారు. దీంతో రణ్‌వీర్ 'డాన్ 3' బృందంతో చర్చలు జరిపి కొత్త నిబంధనల ప్రకారం ఆ సినిమాలో నటించే అవకాశం ఉన్నట్లు బీటౌన్ మీడియా పేర్కొంది.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com